# కమ్మని పానీయం.. పోషకాలు పుష్కలం



రాగి జావ తీసుకుంటున్న విద్యార్థులు (ఫైల్)

- విద్యార్థుల్లో పౌష్టికాహార లోప నివారణే లక్ష్యంగా రాగిజావ పంపిణీ చేస్తున్న ప్రభుత్వం
- సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ భాగస్వామ్యంతో సర్కారు పాఠశాలల్లో కార్యక్రమం
- హుజూరాబాద్ మండలంలో 2616 మంది పిల్లలకు ప్రయోజనం

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్ 8: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి సర్కారు పాటుపడుతున్నది. ఇందులో భాగంగా భావిభారత పౌరుల్లో పౌష్టికాహార లోపాన్ని నివారించే లక్ష్యంతో సర్కారు బడుల్లో బలవర్ధక ఆహారం రాగిజావను పంపిణీ చేస్తున్నది. స్వచ్ఛంద సంస్థ సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్ భాగస్వామ్యంతో చేపట్టిన ఈ కార్యక్రమంతో మండలంలో 2616 మంది విద్యార్థులు లబ్ధిపొందుతూ ఆరోగ్యవంతంగా ఎదుగుతుండగా, తల్లిదండ్రుల్లో ఆనందం వ్యక్తమవుతున్నది.

రాష్ట్రంలోని 33 జిల్లాల్లో ఉన్న 600 మండలాలకు సంబంధించిన 25 లక్షల మంది విద్యార్థులకు రాగిజావను అందజేస్తున్నారు. విద్యార్థులు ఉదయం అర్ధాకలితో, అల్పాహారం తినకుండా పాఠశాలలకు రావడాన్ని గమనించిన ప్రభుత్వం ఫైబర్ మిల్లెట్స్ పోషక విలువలతో కూడిన రాగిపిండి, బెల్లాన్ని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అందజేస్తున్నది. కర్ణాటక రాష్ట్రం చిక్ బల్లపూర్ కేంద్రంగా పనిచేస్తున్న సత్యసాయి అన్నపూర్ణ ట్రస్ట్, రాష్ట్ర ప్రభుత్వం 50:50 శాతం భాగస్వామ్యంతో ఈ పథకం అమలవుతున్నది. ఒక్కో విద్యార్థికి 10గ్రాముల బెల్లం, 10 గ్రాముల రాగి పిండి కలిపి పిల్లలకు పూర్తి పోషకాలతో కూడిన రాగిజావను అందిస్తున్నారు. హుజూరాబాద్ పట్టణంతో పాటు మండలంలోని విద్యార్థులకు రోజు విడిచి రోజు బలవర్ధకమైన పోషక విలువలతో కూడిన రాగి జావను అందజేస్తూ వారిలో రక్తహీనతను నివారిస్తున్నారు. హుజూరాబాద్ మండలంలో 52 పాఠశాలల్లో మొత్తం 2616 మంది విద్యార్థులకు వారానికి మూడు సార్లు అందజేస్తున్నారు. అలాగే పనిచేస్తున్న వంట కార్మికులకు ప్రత్యేకమైన దుస్తులను కూడా వితరణ చేశారు.



హుజూరాబాద్ ఎమ్మార్సీలో పాఠశాలలకు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్న రాగి జావ, బెల్లం ప్యాకెట్లు


### వారానికి మూడు సార్లు అందిస్తున్నాం



విద్యార్థులు ఉదయం అన్నం తినకుండా పాఠశాలకు వస్తుండడంతో వారికి సైడ్ ఎఫెక్ట్స్ లేకుండా ప్రభుత్వం రాగి జావను అందిస్తున్నది. దీంతో పిల్లలు రక్తహీనత లేకుండా ఆరోగ్యంగా ఎదిగే అవకాశం ఉంది. మండలంలోని 52 ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో వారానికి మూడు సార్లు ఉచితంగా రాగి జావ పంపిణీ చేస్తున్నాం. విద్యార్థులు రాగి జావ తీసుకోవడంతో సాయంత్రం ప్రత్యేక తరగతులకు సైతం ఉత్సాహంగా వస్తున్నారు.

*- కేవీ నరసింహారెడ్డి, మండల విద్యాధికారి (హుజూరాబాద్)*

# బీఆర్‌ఎస్‌తోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



కనపర్తిలో కానిస్టేబుల్ ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను సన్మానిస్తున్న ఎంపీపీ, సర్పంచ్

- యువత సద్వినియోగం చేసుకోవాలి
- ఉన్నత స్థాయికి ఎదిగి ఆదర్శంగా నిలువాలి
- ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి

వీణవంక, అక్టోబర్ 8: తెలంగాణ రాష్ట్రంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరిగాయని ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కనపర్తి గ్రామానికి చెందిన అల్లపురెడ్డి రాజు, అల్లపురెడ్డి ప్రశాంత్, తడిగొప్పుల చందు, ముత్యాల ప్రవళిక, బొల్లు రఘు ఇటీవల ప్రకటించిన పోలీస్ కానిస్టేబుల్ ఫలితాల్లో ఉద్యోగాలు సాధించగా, ఆదివారం సర్పంచ్ పర్లపెల్లి రమేశ్ ఆధ్వర్యంలో వారికి ప్రత్యేక సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఉద్యోగాలు సాధించిన ఐదుగురు అభ్యర్థులతో పాటు వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతి రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో ఐటీశాఖ మంత్రి కేటీఆర్ కృషితో విదేశాల నుంచి ఎన్నో కంపెనీలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెడుతూ కంపెనీలు స్థాపిస్తుండడంతో ఉపాధి అవకాశాలు పెరిగాయని తెలిపారు. స్వరాష్ట్రంలో యువత భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని సీఎం కేసీఆర్ టీఎస్‌పీఎస్సీ ద్వారా లక్షకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశారని తెలిపారు. యువత వ్యసనాలకు దూరంగా ఉండి ఉద్యోగ, ఉపాధి సాధనలో ముందుకు సాగాలని సూచించారు. ఉద్యోగాలు సాధించిన యువతీయువకులను నిరుద్యోగులు ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలన్నారు.

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

మండలంలోని కనపర్తి గ్రామానికి చెందిన వి.సతీశ్ అనారోగ్యానికి గురికాగా, ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో రూ.56 వేల ఆర్థిక సాయం మంజూరు కాగా, ఈ మేరకు చెక్కును ఆదివారం ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి, సర్పంచ్ పర్లపెల్లి రమేశ్ లబ్ధిదారుడికి అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ గ్రామాధ్యక్షుడు శశికుమార్, వార్డు సభ్యులు తిరుపతి, కోమల్‌రెడ్డి, అశోక్, మాలమహానాడు మండలాధ్యక్షుడు నర్సయ్య, నాయకులు పూర్ణచందర్, శ్రీనివాస్, బొల్లు సదయ్య, కోమల్‌రెడ్డి, హుస్సేన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

సైదాపూర్, అక్టోబర్ 8: మండలకేంద్రంలోని వెన్కేపల్లి జడ్పీహెచ్‌ఎస్ 1998-99 బ్యాచ్ ఎస్‌ఎస్‌సీ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రిటైర్డు ఎంఈవో కవ్వ తిరుపతిరెడ్డి, ఉపాధ్యాయులు కాయిత రాజిరెడ్డి, సమ్మయ్య, ఎజాజ్‌తో పాటు ఆఫీస్ సబార్డినేట్ లక్ష్మి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనానికి హాజరైన పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు



మాట్లాడుతున్న జిల్లా ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్యముదిరాజ్

# కేసీఆర్ పాలనలోనే ముదిరాజ్‌ల అభివృద్ధి

- ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్యముదిరాజ్

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్ 8: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వ పరిపాలనలోనే ముదిరాజ్‌లు అభివృద్ధి పథంలో పయనిస్తున్నారని ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కొలిపాక సమ్మయ్యముదిరాజ్ పేర్కొన్నారు. స్వార్థనాయకులు ఎన్ని కుట్రలు చేసినా సీఎం కేసీఆర్ నుంచి ముదిరాజ్‌లను వేరు చేయడం ఎవరితరం కాదని స్పష్టం చేశారు. హుజూరాబాద్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ మధ్య కాలంలో ఈటల రాజేందర్‌ముదిరాజ్, కాసాని జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ ముదిరాజ్‌లను సంఘాలుగా విభజిస్తూ స్వార్థ రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. నిజంగా వారు ముదిరాజ్‌ల అభివృద్ధిని కోరుకునేవారే అయితే ముందు వారి పార్టీలకు, పదవులకు రాజీనామా చేయాలని సమ్మయ్య డిమాండ్ చేశారు. బీసీ(డీ)లో ఉన్న ముదిరాజ్‌లను బీసీ(ఏ)లోకి తేవడం కూడా సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని తెలిపారు. ముదిరాజ్‌లందరూ కులం ముసుగు వేసుకున్న స్వార్థ రాజకీయ నాయకుల మాటలు నమ్మకుండ సబ్బండ వర్గాల అభివృద్ధి ప్రదాత అయిన సీఎం కేసీఆర్‌ను అనుసరించాలని సమ్మయ్య విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో 19వ వార్డు బీఆర్‌ఎస్ పార్టీ ఉపాధ్యక్షుడు గుడ్డేల్లుల రాజేశ్‌ముదిరాజ్, ముదిరాజ్ మహాసభ నాయకులు దండబోయిన స్వామిముదిరాజ్, గోస్కుల శ్రీనివాస్‌ముదిరాజ్, రాజన్నముదిరాజ్, బీ రాముముదిరాజ్, కుమార్, పీ శ్రీధర్ ముదిరాజ్, రాజ్‌కుమార్, సమ్మయ్య, కొమురయ్య పాల్గొన్నారు.

# కురుమ సంఘం యూత్ నూతన కమిటీ



కొత్త కమిటీతో కురుమ సంఘం నాయకులు

జమ్మికుంట, అక్టోబర్ 8: మున్సిపల్ పరిధిలోని ఆబాది జమ్మికుంట కౌన్సిలర్ దయ్యాల శ్రీనివాస్, జమ్మికుంట గొర్ల కాపరుల సహకార సంఘం అధ్యక్షుడు ఎగిత రవీందర్, పీఏసీఎస్ డైరెక్టర్ దయ్యాల సదానందం, కుల పెద్దమనిషి కొమ్ము రాజయ్య, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు ఎగిత నిఖిల్ ఆధ్వర్యంలో ఆదివారం కురుమ సంఘం యూత్ ఎన్నికలు జరిగాయి. నూతన కమిటీని నాయకులు ఏకగ్రీవంగా నియమించారు. అధ్యక్షుడిగా గొవింద సంతోష్, ప్రధాన కార్యదర్శిగా ఎగిత అఖిల్, ఉపాధ్యక్షుడిగా కొమ్ము రాజు, సహాయ కార్యదర్శిగా కోరె రంజిత్, కోశాధికారిగా కొమ్ము విజయ్, ముఖ్య సలహాదారుగా కొమ్ము అశోక్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కోరె శ్రీనివాస్, కమిటీ సభ్యులను నియమించారు. తర్వాత నూతన కమిటీని సంఘం నాయకులు, పెద్దలు ఘనంగా సన్మానించారు. ఇక్కడ సంఘం సభ్యులున్నారు.

# కొనసాగుతున్న బతుకమ్మ చీరల పంపిణీ



తుమ్మనపల్లిలో బతుకమ్మ చీరలు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

హుజూరాబాద్‌టౌన్, అక్టోబర్ 8: పట్టణంలో బతుకమ్మ చీరల పంపిణీ కార్యక్రమం కొనసాగుతున్నది. పట్టణంలో 9,618 మంది ఆడబిడ్డలు ఉండగా, అందరికీ బతుకమ్మ పండుగ కానుక అందేలా అధికార యంత్రాంగం పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నది. ఇప్పటికే పట్టణంతో పాటు అన్ని విలీన గ్రామాల్లో బతుకమ్మ చీరల పంపిణీ కొనసాగుతుండగా, మహిళలు వాటిని ఆనందంగా అందుకుంటూ మురిసిపోతున్నారు. ఆదివారం సైతం పలుచోట్ల చీరలు పంపిణీ చేయగా, మహిళలు తరలివచ్చారు. కార్యక్రమాల్లో పలు వార్డుల ప్రజాప్రతినిధులు(కౌన్సిలర్లు), వార్డుల ప్రత్యేకాధికారులు, రేషన్ డీలర్లు, మెప్మా ఆర్పీలు, మహిళలు పాల్గొన్నారు.

### తుమ్మనపల్లిలో..

హుజూరాబాద్ రూరల్, అక్టోబర్ 8: మండలంలోని తుమ్మనపల్లి గ్రామంలో ఆదివారం బతుకమ్మ చీరలను సర్పంచుల ఫోరం మండలాధ్యక్షుడు గూడూరి ప్రతాప్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా మహిళలకు పండుగ కానుకగా చీరలు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బేతి రాజిరెడ్డి, వార్డు సభ్యుడు రమేశ్, రేషన్ డీలర్ యాళ్ల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.